భారతమాతృ శతకము

13712

శ్రీ శారదా గ్రంథమాల, కల్లూరు.
ద్వితీయ కుసుమము ౨.

భరతమాతృ శతకము.

అంకితము.

ఆ-వె. చిన్ని నాట నుంచి ♦ మన్నించి, పెంచి
న్నింతగాఁగఁ జేసి ♦ యెలమి బ్రోచి
నట్టి నాదు మేన ♦ యత్తకు "యాజాని
కమ్మ" కిడుదు దీని ♦ యంకితంబు.

గ్రంథకర్త.
కల్లూరు అహోబలరావు
(రచితము. ప్రకటితము.)

ప్రథమ ముద్రణము. 1000.
రామాముద్రాక్షరశాల, ఏలూరు.
1923 డిశంబరు.
చందాదారులకు 0-2-0
[ఇతరులకు 0-3-0

విన్నపము

ఈ శతకమును రచించుటకు నన్నుఁ బురికొల్పినది. శ్రీయుత మం గిపూడి వేంకటశర్మగారిచే ప్రణీతంబైన "ఆంధ్రమాతృశతకము" ఆశతకమ లోని పద్యముల "పినాకినీ" పత్రికయందు నప్పుడప్పుడు గాంచుచుండి నేను కడు సంతసించి యదే రీతి "భరతమాతృశతక" మొకటి యుండి శరంబు శోభిల్లఁగాలకున్నె, యను యూహ నామనంబునఁ దట్టి య మొదలప్పుడప్పుడు కొంత కొంతగా నీ పద్యముల రచించుచు, ఈశతకము పూర్తి జేసితిని. దీనిని రచించుటలో నా విద్యాపాండిత్యముఁ జూపుట కాదు శ్రీయుత మంగిపూడి వేంకటశర్మగారిని యుదాసీనమున జూచుట మొద కాదు. వారలకును నాకును హస్తిమశకాంతరంబు. వారి కున్న కొండంత యోగ్యతలో, గోరంతయు నేబొంది యుండను. ఇంతగాఁ బలికి నందుకి వారు నన్ను క్షమింపఁ బ్రార్థితులు.

వచ్చియును రాని పిల్లల పలుకులవలె నిందెన్నియో తప్పులు దొరలి యుండవచ్చును. తల్లి తన యనుఁగుశిశువు జిలిబిలిపలుకులు పలుకునప్పుడు, కర్ణానందముగ యాకర్ణించును గాని కసరుకొనదు వేసటఁ బొందదు. అదే రీతి మీరు నా యీ ప్రథమ ప్రయత్నమున తప్పులు పట్టక పాలును నీరును గలసియున్నను, హంసపాలను మాత్రము వేఱుపఱచి గ్రోలుకరణి తాముకూడా మంచి గొని చెడ్డ విడిచెదరని ప్రార్థించుచున్నాను.

అమ్మా! భారతమాతా! ప్రపంచము పుట్టిన దాదిగ నీవు వెలసియు న్నదానవు! నిన్నెందరో కీర్తించి ధన్యతనొందిరి! నీ వెంత శ్రీయుతాకారవు! నీయందెట్టి పావనీయ మహానదు లుద్భవించి ప్రవహించుచున్నవి ఎట్టిమహా మహులు వీరపురుషులు నీయందుద్భవించియున్నవారలు! ఎట్టి పూజ్యవే వేదములు నీయందుద్భవించెను! ఎట్టి విద్యలు, కళలు, శాస్త్రములు, శిల్ప ములు, చిత్రములు నీయందు విరాజిల్లుచున్నవి! అమ్మా! నాయోపి నంతమ ట్టుకు నిన్ను స్తుతించెద! సావధానమనస్కురాలవై యాకర్ణింపుము.

తొమ్మిదినెలలు గర్భమున మోచి, విశేషకష్టమున బ్రసవించి, యల్లారు ముద్దుగ బెంచి సతతము శిశువు సేమముల నారసి మిక్కిలి ప్రీతితో చనుబా లనొసఁగి, నిద్దురవచ్చిన జోకొట్టి, యింతవాని నంతవానిగ, నంతవాని నింత వానిగ జేసి కాపాడిన మాతకన్న నీవెక్కువకాదా! అమ్మా! నీవు నిత్యసత్య వ్రతవు! పతివ్రతవు! పరోపకారత నీయందు దాండవమాడుచున్నది! ఇటు వంటి నిన్ను కీర్తింపని వాని జన్మమేల!

ఇట్లు,

గ్రంథకర్త.

భాషాభిమానులారా,

'చేతఁగానియమ్మకు చేష్టలు మెండు' అనుసామెతప్రకారముగా, గ్రంథముల రచించు శక్తిసామర్థ్యములా సున్న; ప్రజ్ఞావిశేషములా కొంత; బుద్ధివైభవములా లేవు; తుదకు నలువురు మెచ్చుకొనువచన రచనకైన గీతజాతమునకైన నోచుకొన్నవాఁడఁగాను. ఇట్టి యజ్ఞానమున-పామరత్వమున-మందబుద్ధిని-దొప్పదోఁగుచున్నను నామనంబేలకో 'భాషాసేవ' జేయ నత్యంతకుతూహలాయత్తచిత్తమై యున్నయది.

'మనసా, నిశ్చంచలుఁడవగుము. చేతఁగానిపని నెందుకుదెచ్చి పెట్టుకొందువు. మొదటనే మందబుద్ధివి. అటుగాక బాల్యచాపల్యమునఁజేయ సాహసించినను అందులకు వలయు ధనమూలేదు. ఇప్పటి దేశకాలపరిస్థితులలో, నీగ్రంథముల నాదరించువారునులేరు. కొనువారంతకు ముందేలేరు. ఎట్లైనఁగానిమ్ము; ఖర్చుపెట్టెదనందువా? గర్భదారిద్ర్యముననుభవించుచు, అపూటకాపూటఁ గడపుట యతికష్టమైయుండ, భార్యాబిడ్డలఁ బోషించుటే బరువైయుండ, కట్టబట్టయు పొట్టకు పట్టెడన్నము నెట్టెటో యిక్కట్టులబడి దెచ్చుకొనుచుండ, వర్షమా భరతవర్షమై, త్రాగజలంబులుగూడ భూమండలంబున, అందుల మన దత్తమండలంబుల సంశయంబు

లై, తటాకంబులు, వాపీకూపసరోవరంబులు జలాభావంబులై, పంచవర్షంబులనుండి పొలంబులఁబండు సస్యంబులు లేక, దినధాన్యంబులు లేకఁ, జేయ కార్యంబులు లేక, పోవమార్గంబులు లేక యనేకవిధంబుల జనంబుల నష్టకష్టంబులఁ బెట్టుచుండ, పశుగణంబులుకూడ కొఱుక పచ్చిక లేక యల్లల్లాడుచుండ, జనంబుల ముఖమండలంబుల సంతోషంబులు స్వర్గకుసుమంబులై యుండ, నీవిధంబున సంపాదనంబొనరించి, ఖర్చుపెట్టెదనందువు, వలదు! యీసాహసంబువలదు! ఉడుగుము!' అని యెంతగా యుద్బోధించుచుండినను, మఱియు నామిత్రులు కొందఱు ,ఏయుద్యమమును బూనినను నయ్యది జయప్రదముగ నెఱవేర్పఁబూనుట ధీరులమార్గము. మీరు ధనవిషయమున మిగుల జాగరూకత వహింపవలయును, జనసహాయము సేకూర్పవలయును- పండితులు మేలుకొనవలయును- ఈసంవిధానత్రయమునననుసరించితిరా' యని హెచ్చరించుచుండినను పాటింపక నామనంబేలొకో యందనిపండ్ల కఱ్ఱుసాచుచున్నది. అభ్రపథంబుననున్న నక్షత్రంబుల లెక్కించుచున్నది.

ప్రయత్నము పురుషలక్షణము. ఫలము దైవాధీనము. చింతింపవలదు. ఇంతవిశాలమైన యాంధ్రరాష్ట్రమున, లక్షాధికారులు, ప్రభువులు, జమీందారులు, వర్తకశిఖామణులు వెలయుచోట నీయీచిన్నికార్యమునకుఁ జేయూతనొసఁగు వారుండరా ?

గీ. పరగ నట్టింటనుండినా ♦ భాగ్యమనిన
పైవ మెక్కడ గొని తెచ్చి ♦ దనకుబెట్టఁ
జేయవలసిన యత్నముల్ ♦ చేయవలయు
దానిమీఁదట దైవ య ♦ త్నంబు సుమ్ము.

అను నార్యోక్తి జ్ఞప్తి యందిడుకొని, కార్యమారంభింపుము. విఘ్నములు వాటిల్లునో యేమో యని విచారపడి లాభములేదు, ఆరంభింపరు నీచ మానవులు విఘ్నాయాస సంత్రస్తులై ' యను నార్యోక్తి ననుసరించి విఘ్నములకు భయపడి ప్రయత్నము విడుచుట నీచ జనంబుల లక్షణంబు. సర్వ విఘ్నముల హరించు యా విఘ్నేశ్వరుడుండగా మన కేమి భయము :

శ్లో. శుక్లాంబర ధరం విష్ణుం । శశివర్ణం చతుర్భుజం
ప్రసన్నవదనంధ్యాయే । సర్వ విఘ్నోప శాంతయే.
అగజానన పద్మార్కం । గజానన మహర్నిశం
అనేక దంతం భక్తానాం । యేకదంతముపాస్మహే.

అని యాతని ప్రార్థించుము. అతఁడు సర్వవిఘ్నముల పరిసమాప్తఁజేయును. అని నామనంబు నన్ను పురికొల్పు చున్నది.

సాక్షులన్నిటిలో మనస్సాక్షి గొప్పది. అదియే ఆది శక్తియనియందురు. కాననే అస్మదీయమానసంబు పురికొల్పినచందంబున భారంబంతయు మీపైవైచి నేనిక్కార్యమునకు బూనితిని.

ఇందుపై మీ రేమందురు ? భాషాభిమానులైన యో యుదారహృదయులారా ! నాచే నుద్యమింపబడిన యీచిన్ని కార్యకలాపమునకు మీమీ యోపినంతమట్టుకు సాయముఁ జేయుడు. రాజపోషకులుగాను, పోషకులుగాను, అభిమానులుగాను చందాదారులుగాను నీశారదాగ్రంథమాలకుచేరి శ్రీశారదను పోషింపుడు. వానచినుకులు స్వల్పమౌ కణములైనను యొక్కొక్కటిని జేరి యొకచిన్నవంక, యావంకలొక్కొక్కటిని జేరి యొక కాలువ, యాకాలువ లొక్కొక్కటిని జేరి యొక ప్రవాహము. యాప్రవాహములొండొంటితోఁ గలిసి యొక యుపనది:—యా యుపనదు లొక్కొక్కటిని జేరి యొక నది యగునట్లు పలువురు మీరు మీ చిన్నిచేతుల నీవైపు ప్రసరించిన యీ 'శ్రీశారద' సర్వాలంకార భూషితయై గ్రాలఁ గలదు. ఇప్పుడే యుదయించినది. గ్రోల క్షీరములు లేక చనిపోయిన మనకు శిశుహత్యా పాపము దాపరింపదా ? అయ్యలారా ! శ్రీశారద మిమ్ము నెక్కువగా యడుగదు. ఆమె కడుపునిండిన తర్వాత నొక కబళమేని యెక్కువ మ్రింగబోదు. ఆహారమును మితముగా గ్రహించి యారోగ్యమును కాపాడుకొన నిచ్చగలది. సాదర బుద్ధిని మీరలెల్లరీ సదుద్యమమునకుఁ దోడ్పడి నన్ను ప్రోత్సహించెదరని మిక్కిలి వినయ విధేయములతోఁ బ్రార్థించుచున్నాను.

ఇట్లు విన్నవించు-
కార్యదర్శి.

కృతజ్ఞత.

నా వేడుకోలు ననుసరించి మ. రా. శ్రీ. కల్లూరు యజమాన వేంకట నారాయణరావు బి. ఏ. గారున్ను, వేపాటి వెంకట్రావుగారున్ను యీ చిన్ని శతకమును కొలఁది కాలములోనే నిర్దుష్టముగా సవరించి యిచ్చినందులకు వారికి యిందు మూలమున నాయొక్క కృతజ్ఞతా పూర్వక నమస్కారంబు లర్పించుచున్నవాఁడను.

మ. రా. శ్రీ. ఏలూరు రామా ముద్రాక్షర శాలాధికారులగు యీదర వెంకట్రావు పంతులుగారు మా గ్రంథమాలా ప్రచురములను మాకొఱకు కొంత తగ్గుధరలకు అచ్చువేసి యిచ్చెదమని చెప్పి, తమ యుదార స్వభావమును వెల్లడించినందులకు వారికి వందనశతంబు లాచరించుచు, వారి కుటుంబమునకు పరాత్పరుఁడు నెల్లవేళల శుభ మిడు గాత యని కోరు చున్నాము. కొలఁది కాలములోనే నిర్దుష్టముగా నీ శతకమును అచ్చువేసి యిచ్చి నందులకు పంతుల వారికి మా కృతజ్ఞతా పూర్వక వందనము లర్పించు చున్నవారము.

ఇట్లు,

సంఘ సభ్యులు.

గ్రంథాలయ చరిత్ర.

1919 వ వత్సరమున అక్టోబరు మాసమున 3 వ తేదీన నీ గ్రంథాలయము మొట్టమొదట నేబది గ్రంథములతో ప్రారంభింపబడెను. నాటనుండి మిత్రుల సాహాయ్యమున, గ్రంథ సంఖ్యయందును, పాఠకుల సంఖ్యయందును క్రమ క్రమముగా వృద్ధిజెంది ప్రకృతము మూడువందలయాంధ్ర గ్రంథములతోను, రెండువందల ఆంగ్లేయ గ్రంథములతోను, వంద సంఖ్యగల కర్ణాటక గ్రంథములతోను నడచుచున్నది. అయినను తగు ధన జన సహాయ్యములేమి సర్వ స్వతంత్రమై నడవారకున్నయది.

ఇప్పటికిని, కార్యదర్శిగారి యింటి యుపరిగృహపైనున్న యొక చిన్న గదియందే, యీ గ్రంథాలయము నెలకొల్పబడి యున్నది. గ్రంథాలయమునకు సర్వ స్వతంత్రమైన యొక మందిర నిర్మాణ మవశ్యకర్తవ్యమై యున్నయది. భూస్వాములు' జమీందారులు, వర్తకులు మొదలుగాగల యాంధ్ర భాషాభిమానులెల్లరీ సత్కార్యమునకు తగు విధముల సహాయమొనరించి మాయొక్క కృతజ్ఞతాభి వందనములం దైకొన మిగుల వినయ విధేయములతోఁ బ్రార్థించుచున్నారము.

మూలధనమా కొంత. ఏదియో యల్పస్వల్పముగా మిత్రులెల్లరు కూడి చందాగా వసూలుజేసి సేకరించియుండు

నది నేఁబది రూపాయలు మాత్రము. కోరికలా యెక్కువ-రొక్కమా తక్కువ- దాని నష్టులనే వృద్ధిఁ జేయనెంచి సొసైటీయందుంచినారము.

దైవ సాహాయ్యము కలుగక పోవఁదను ధైర్యముతో అనేక కష్ట నష్టముల కోర్చి యీ గ్రంథమాలా కార్యమునకు గడంగితిమి. దీనియొక్క యూర్ధ్వ యధోగతులెల్లను సుహృదయము నాదరించు మాయొక్క చందాదారులపై నాధారపడియున్నది. దయచేసి గ్రంథమాలకు చందాదారులై మమ్ము ప్రోత్సాహింపవలెనని మిక్కిలి వినయవిధేయములతో ప్రార్థించుచున్నారము.

ఇట్లు విన్నవించు

సంఘసభ్యులు.

శ్రీరస్తు.

భరతమాతృ శతకము.

భారతమాతృస్వరూపవర్ణనము.

గీ. శ్రీకరంబగు తుహినాద్రి ♦ శీర్షమునకు
శ్వేతమకుటమై చెన్నారి ♦ సితతరంగ
గంగయును, బ్రహ్మపుత్రియుఁ ♦ గంఠమునకు
భవ్యమణిహారములు నీకు ♦ భరతమాత. 1

గీ. వంగ గుజరాతు దేశముల్ ♦ భవ్యలీల
బాహువల్లికలై గ్రాల ♦ బహుళమైన
వింధ్యనగము వడ్డాణమై ♦ వెలయ సత్య
చరితవై నీవు బరగెదో ♦ భరతమాత. 2

గీ. గాంగసైకతస్థలియు వ ♦ క్షంబుగాఁగ
మెఱుఁగు దిబ్బలు గుబ్బల ♦ మిసిమినొసఁగ
బచ్చసస్యముల్ కంచుకం ♦ బగుచు నుండ
ధరణి వెలయుచునుందువో ♦ భరతమాత. 3

గీ. సింహళద్వీపమది నీకు ♦ శ్రేష్ఠముగను
పాదపీఠంబుగాఁగ త్రి ♦ పార్శ్వములను
వెలయువనధులు నిన్ను సే ♦ వించుచుండ
భామవై, గ్రాలుచుందువో ♦ భరతమాత. 4

గీ. అలఘు కాశ్మీర దేశ మా ♦ స్యంబుగాఁగ
భవ్యమై ఖరి బాహాఁపుల్ ♦ బ్రిక్కలకును
చాచి శౌర్యగాంభీర్యముల్ ♦ చౌకళింప
వైభవోన్నతిఁ బరగెనో ♦ భరతమాత. 5

గీ. అఖిల భూషణావృతమయి ♦ యందముగను
సకల సౌభాగ్య సంపద ♦ జగతియొప్ప
రంగు బంగారు చెంగల్వ ♦ రహిని దాల్చి
వసుధ శ్రీమించియుండునో ♦ భరతమాత. 6

గీ. శిరభాగంబునఁ బోల్చు ♦ శీతనగము
భూరికుడ్యంబుగా గాలి ♦ రోసలు దేశ
మందునడుగిడ శత్రుగే ♦ యూహమంపు
బాధకెవ్వరు సహియింత్రు ♦ భరతమాత. 7

గీ. శీతనగమున 'ఎవరెస్టు' ♦ శిఖరమొండు
అవనినత్యున్నతంబయి ♦ యలరుచుండు
దానఁదెలియంగరాని విం ♦ తలవియెన్నొ
ప్రణుతి కెక్కుచునుండును ♦ భరతమాత. 8

గీ. శాత్రవుల కెల్ల ధాత్రి న ♦ సాధ్యమైన
పర్వత శ్రేష్ఠ ముత్తర ♦ భాగమందు
సృష్టియొనరించి దేవుండు ♦ శిష్టమతిని
భారతీయులఁగాపాడె ♦ భరతమాత. 9

గీ. ఇందు నెన్నియొ రత్నంబు ♦ లింపుగులుకు
వజ్రములును, వైఢూర్యముల్ ♦ వాసిగాను

పుష్యరాగముల్ మాణిక్య ♦ ములును వెలయు
వశమెవానినిగణియింప ♦ భరతమాత. 10

గీ. మఱియుఁ, బహువిధ లతలును, ♦ తరువితతియుఁ
బుష్పసంతతియునులతా ♦ పుంజములును
నేత్రములకింపుమైయొప్పు ♦ నెగడుచుండు
వడఁకుగుబ్బలియందుయో ♦ భరతమాత. 11

గీ. అల్లనల్లనఁగూయువి ♦ హంగతతియు
మెల్లగాఁబాఱు సెలయేళ్ళు ♦ చల్లగాను
వీచుమందమారుతమును ♦ వృక్షతతియు
బరమసంతోషమునుగూర్చు ♦ భరతమాత. 12

గీ. కానబుషిపుంగవులుమున్ను ♦ ధ్యాననిష్ఠు
లగుచునాశ్రమములను, నీ ♦ యందొనర్చి
తపములనుసల్పి పరమప ♦ దంబుఁబొంది
ప్రబలకీర్తినిఁజాటిరి ♦ భరతమాత. 13

నదులు-క్షేత్రములు.

గీ. జీవనదులైన జాహ్నవి, ♦ సింధు, బ్రహ్మ
పుత్రసతతంబుఁ బ్రవహించి ♦ భూములెన్నొ
సారవంతంబులుగఁ జేసి ♦ సస్యచయము
లరయ పండించుధాత్రిని ♦ భరతమాత. 14

గీ. గాంగసింధుమైదానమే ♦ కాలమునను
పుష్టిగాయుండి పంటసం ♦ పూర్ణముగను

పండ జేయంగ కాటకం ♦ బనెడిమాట
ప్రజల నోటనురాదట ♦ భరతమాత. 15

సీ. సస్యసంశోభితంబగు ♦ సతము నొప్ప
భవ్యసౌభాగ్య సంపద ♦ వలపు గొలుప
లక్ష్మితల్లికొత్త వక్షస్థ ♦ లంబునందు
భాగ్యముసఁ దేలి యాడెదు ♦ భరతమాత 16

సీ. ఇలను జీవనాధారంబు ♦ సులభమైన
చోటఁ జేసుట జనముల ♦ సాత్మ్యగుణము
కాన జనసంఖ్యయుత్కృష్ట ♦ క్రమముగాను
పెఱిగెనీయందు ఖ్యాతియై ♦ భరతమాత. 17

సీ. ఆకలైనట్టి వేళను ♦ యనుఁగుపట్టి
ముఖమునను ద్రాగఁ దల్లిపా ♦ ల్మునకు నెనరఁ
గవిలి నిద్రించు కానిపా ♦ పముల చెంతఁ
బండునే యెప్పుడైనను ♦ భరతమాత. 18

సీ. నర్మదాకృష్ణకావేరి ♦ నదులుమఱియుఁ
సపతి గోదావరులును మా ♦ తామ్రపర్ణి
యును, మహానదియు, పినాకి ♦ యును జెలంగు
ధరణి దక్షిణదిక్కున ♦ భరతమాత. 19

సీ. ప్రజలకెల్లెడఁబంటల ♦ బండఁజేసి
నిత్యముపయోగకారియై ♦ నెగడునట్టి
జీవవాహినులెచటనీ ♦ క్షింపనగును?
భారతావనివీడియో ♦ భరతమాత 20

గీ. జానకీ రామలక్ష్మణుల్ ♦ జలకమాడి
నట్టి పుణ్యాంపువాహినుల్ మెట్టినట్టి
రమ్యమొనగూర్చు దండకా ♦ రణ్యభూమి
పరమపావన క్షేత్రంబు ♦ భరతమాత. 21

గీ. నాసికాక్షేత్రమున శూర్ప ♦ ణఖనుముక్కు
లక్ష్మణుఁడు గోసెనని యాస్థ ♦ లంబు నిపుడు
"నాసికా" యని పిలుతురు ♦ నరులు యచట
వచ్చిబోవుచు నుందురు ♦ భరతమాత. 22

గీ. వారణాసి, తిరుపతి, శృం ♦ గేరి, కాళ
హస్తి, రామేశ్వరంబు, ప్ర ♦ యాగ, పక్షి
తీర్థము, నహోబలంబాది ♦ దివ్యమైన
పావనక్షేత్రములు నొప్పు ♦ భరతమాత. 23

గీ. వసుధ శ్రీశైలమును, హరి ♦ ద్వారమును, చి
దంబరమును, శ్రీరంగక్షే ♦ త్రమును, బహుళ
ముగ జనాకర్షణంబులై ♦ జగతిఁ బరఁగు
వశమె వానిని గణియింప ♦ భరతమాత. 24

శకుంతములు.

గీ. పలురకములైన పులుఁగులు ♦ బహువిధముల
వృక్షతతియును లతలును ♦ వెలయుచుండు
ఇట్టి చిత్రవిచిత్రంబు ♦ లెందుగలవు
భాగ్య రాశివి మాయమ్మ ♦ భరతమాత. 25

గీ. ఇంపొనర హాయిఁ బాడు కో ♦ యిలలసంతు
సుఖముఁగల్గ నాలాపించు ♦ శుకగణంబు
కంఠములరఁ బాడెడి శారి ♦ కములవితతి
భవ్యసౌభాగ్య మొనగూర్చు ♦ భరతమాత. 26

గీ. చిత్రమౌ వన్నె చిన్నెలఁ ♦ జెలువుఁ జెంది
నేత్రములకంద మొనగూర్చి ♦ గాత్రమట్టి
గగుర్పాటొందఁ జేసెడి ♦ ఖగచరంబు
లరయ కోటాను కోట్లుండు ♦ భరతమాత. 27

గీ. తలప వివిధ శకుంత ♦ సంతానములును
ఇట్లు లేదేశమందైన ♦ నెలమి గులుక
మధుర గీతముల జనులను ♦ పరవశులుగఁ
గరము యొనరింపుచున్నదే ♦ భరతమాత. 28

వీరపురుషులు—వీరవనితలు.

గీ. పంచపాండవు లనబడు ♦ ప్రభువులెల్ల
నీదు గర్భంబునను బుట్టి ♦ సాదరమున
సత్య ధర్మంబులను ప్రపం ♦ చంబునకును
ప్రకటముగ జాటిరోయమ్మ ♦ భరతమాత. 29

గీ. అలహరిశ్చంద్రుడు దుస్సహ ♦ మందిధరణి
సత్యవాక్యప్రభావంబు ♦ జక్కఁ దెలిపె:
లెక్క లేనన్ని కడగండ్ల ♦ జిక్కుకొనియు
ధరణి నీసాటియెవరుయో ♦ భరతమాత. 30

గీ. జానకియు, దమయంతియు ♦ చంద్రమతియు
ధరశకుంతల, సావిత్రి ♦ ద్రౌపదియును
మరియు నెందఱొ బుట్టిరి ♦ మాన్యులైన
వనితరత్నంబులమ్మరో ♦ భరతమాత. 31

గీ. శీలశౌచసచ్చరితల ♦ శిష్టమతుల
నతులపతిదేవభక్తుల ♦ సతిసుపూజ
లంబులనుధైర్యములనువా ♦ రెందుధరణి
పరమసత్కీర్తిఁజెందిరి ♦ భరతమాత. 32

గీ. ఒకతెవారిధిగట్టించె ♦ యొకతెభర్త
తోడనడవుల నిడుమల ♦ గుడిచెనొకతె
న్యాయమునసేవఁజేసిఋ ♦ ణంబుఁదీర్చె
ధరణినీకుమారితలెల్ల ♦ భరతమాత. 33

గీ, భర్తయవమానమునుఁజేయ ♦ బడలకెంతొ
నిశ్చితార్థంబువదలక ♦ నిండుసభను
సత్యవాగ్వాదమొనరించి ♦ సతియొకర్తె
పరమవిశ్వాసమునుబొందె ♦ భరతమాత. 34

గీ. ధైర్యసాహస గరిమనా ♦ దండధరుని
వెంటఁ బడిపోయి యతనిని ♦ వివిధగతుల
స్తోత్రములఁజేసి, యతని సం ♦ స్తుతులనొంది
భర్త నొక్కర్తె బ్రదికించె ♦ భరతమాత. 35

గీ. కాయగసరులనమలుచు ♦ గాయకష్ట
మెంతయోనియు నొనరించి ♦ చింతలేక

నైదుగురి భర్తలనుబ్రోచె ♦ నడవియందు
పడతియెంతటిసాధ్వియో ♦ భరతమాత. 36

కవులప్రసంశ.

గీ. కాళిదాసు వాల్మీకి, భాస్కరుడు ♦ సోమ
యాజి, నన్నయభట్టు ♦ పెద్దన్న, మొదలు
సత్కవులు జన్మమొంది నీ ♦ చాయనందు
పరమ సత్కీర్తి నొందిరి ♦ భరతమాత. 37

గీ. స్తుత్యబమ్మెర పోతనా ♦ మాత్యరచిత
భాగవత కథార్ణ ♦ వప్రసూత
మహితరసభావ గాంభీర్య ♦ మహితసుధను
తగమె వర్ణింప మాకెల్ల ♦ భరతమాత. 38

గీ. ఎన్ని కడగండ్లఁ బడియు ♦ మహీశుల దరిఁ
జేరి ద్రవ్యార్జనంబుల ♦ జేయడయ్యె
దాను భార్యయు బిడ్డ భూ ♦ తలముదున్ని
పంటపండించి బ్రదికిరి ♦ భరతమాత. 39

గీ. కవిత్రయంబయిగారిలు తి ♦ క్కనయుయెఱ్ఱ
ప్రెగ్గడయును, నన్నయభట్టు ♦ ప్రేమతోడ
భారతంబునుఁ దెనుగించి ♦ భవ్యకీర్తి
వసుధగడియించి వెలసిరి ♦ భరతమాత. 40

గీ. మఱియునెందఱో కవులు ను ♦ ద్భవము నొంది
జగతినల్దిక్కులకు,కీర్తి ♦ జాటినారు

చాటఁబోవుచునున్నాను ♦ చాటగలను
తరమె నీకీర్తివర్ణింప ♦ భరతమాత. 41

గీ. షేక్స్పియర్ ఆఫ్ దియాస్టని ♦ చిత్రముగను
కాళిదాసునువర్ణింపఁ ♦ గనఁగలేమె?
ఖండఖండాంతరస్థుల ♦ కృఅశోమనదు
ప్రబలకవులను వినుతింత్రు ♦ భరతమాత. 42

గీ. ఆదిసంస్కృతభాషను ♦ సాగరము న
నెన్నియోగ్రంథరాజంబు ♦ లెలమిఁ బ్రోచి
అఖిలవిజ్ఞానసంపద ♦ నలవరించి
వరలిరమ్మ! నీపుత్రులు ♦ భరతమాత. 43

గీ అగణితములు, వేదములకు ♦ నాటపట్టు
వగుచుసుజ్ఞానబోధంబు ♦ నార్యులేలఁ
జాటినావెల్లదేశాల ♦ నాటినీకు
వసుధనే దేశమును లేదు ♦ భరతమాత. 44

గీ. అలరవీంద్రుఁడు ఖ్యాతిఁ బొంది ♦ యఖిలదేశ
వాసులను స్వసూక్తికవి ♦ త్వంబుచేత
ముంచిహర్షాబ్ధినోలలా ♦ డించుచుండు
పరహితులు నీసుతులు యా ♦ భరతమాత. 45

వస్త్రపరిశ్రమ.

గీ. తరుణులెల్లెడ మృదులహ ♦ స్తముల నెపుడు
నూలు కోమలంబుగను రా ♦ టాలఁ దీయఁ

గట్టిపుట్టంబులకు లోటు ♦ కలుగ లేదు
భారతావని నెప్పుడు ♦ భరతమాత. 46

గీ. పశ్చిమాసని యంత్రముల్ ♦ గ్రామములంది
తీయ లేనట్టి నూలునీ ♦ దేశమందు
నారమ యుత్సాహకరిమ న ♦ ప్పటిమెలంత
లరసి వడకుచునుండిరి ♦ భరతమాత. 47

గీ. బల్లిపట్టుకన్న మృదుల ♦ ముల్లిపట్టు
కన్న లలితమై యొప్పారు ♦ చున్నయట్టి
వలువలను నేయుచుండిరి భవ్యముగను
ధరణియప్పటి సాలీలు ♦ భరతమాత. 48

గీ. పూర్వమారంగజేబు సు ♦ పుత్రియొకత
మూడునాళ్లుఖకు నలువల ♦ నొడలందాల్ప
నప్పటికి దిగంబరిగాంగ ♦ నగపడియెను
ధరణియానల్వవెట్టివో ♦ భరతమాత. 49

గీ. దక్కమ స్లిస్లుఖండదేశాం ♦ తాంతరముల
రమణులకు నలంకారమై ♦ రాజిలంగ
భరతదేశంపు విఖ్యాతి ♦ వైభవములు
ధరణి నల్దిక్కులకు మోగె ♦ భరతమాత. 50

గీ. మఱియు కాశ్మీర శాలువల్ ♦ మమత మెఱయ
యఖిలదేశాల భూపతు ♦ లర్థవంతు

లెలమి ధరియించి గొనియాడ ♦ లేదె ధరణి?
భరత దేశంపు విఖ్యాతి ♦ భరతమాత. 51

గీ. ముప్పదియు, ముప్పదైదుగ ♦ నూరు గలుగు
పరమ సుకుమార మైనట్టి ♦ వలువ లెన్నొ
సన్న డబ్బీలలో నిమిడ్చు ♦ జాలినారు
భరత దేశంపు సాలీలు ♦ భరతమాత. 52

గీ. ఇప్పటికి మ్యూజియంబుల ♦ నెలమి యాంగ్ల
పతులు భారత దేశ న ♦ ల్వలువ లెన్నొ
మన్ననను జేసి రక్షించు ♦ చున్నవారు
వరలు నీ కీర్తి యెల్లెడ ♦ భరతమాత. 53

గీ. ఇట్టి భాగ్య వైభవము ను ♦ న్నట్టి నీకు
కాలవైపరీత్యత నెట్టి ♦ కష్టమొదవె?
కట్టగా స్వతంత్రింబైన ♦ బట్టలేదు
పలుక సిగ్గగు! హా! కెయో ♦ భరతమాత. 54

గీ. ఈస్టు యిండియా కంపెని ♦ హిందు దేశ
మునను నెలకొనుదాక స ♦ మ్మానము చెలగ
వస్త్రముల పరిశ్రమయును ♦ నాసిగాంచె
ధరణి బడిపోయె నవ్వల ♦ భరతమాత. 55

గీ. పూర్వ యౌన్నత్యములను నీ ♦ పుత్రవరులు
మదిని దలపోసి జీర్ణమై ♦ మంటగలసి

నట్టి వడకు వృత్తి మహాత్ము ♦ నాజ్ఞ మజుల
ధరణిచే బూనియున్నారు ♦ భరతమాత. 56

గీ. భయము లేదమ్మ యింకనే ♦ భయము లేదు
గృహ పరిశ్రమలెందుఁ గ్రి ♦ క్కిరిసియ సాగె
ప్రజల మధ్య స్వాతంత్ర్యేచ్ఛ ♦ ప్రబల వాడగు
భవ్యమా సీదు తపసున ♦ భరతమాత. 57

హిం దూ చ క్ర వ ర్తు లు.

గీ. చంద్రగుప్త, పుష్యోత్తమ ♦ చక్రవర్తి
యూయశోక సముద్రగు ♦ ప్తాది హిందు
చక్రవర్తుల కాలంబు ♦ సంస్తవంబు
చరితమందు ప్రసిద్ధంబు ♦ భరతమాత. 58

గీ. వారి విద్యాభి వృద్ధియు ♦ వారి శిల్ప
శాస్త్రములు, వారి సంగీత ♦ శాస్త్రములును
వారి కవితయును, పరోప ♦ కారతయును
తరమె మాకెల్ల వర్ణింప ♦ భరతమాత. 59

గీ. భువిని రెండవ చంద్ర గు ♦ ప్తుండు రాజ్య
పాలనముఁ జేయుచుండఁగ ♦ ప్రజలు మద్య
పాన, జీవహింసయులేక ♦ బరగిరంచు
'ఫాహియాన్' రికార్డులునుండు ♦ భరతమాత. 60

గీ. శిల్ప, వైద్య, జ్యోతిష శాస్త్ర ♦ చిత్రవిద్య
సంస్కృతపు పాండితి, కవిత ♦ చాల గల్గి

నట్టి విద్యాధికుల కోట ♦ పట్టువగుచుఁ
బరఁగె విక్రమాదిత్యుండు ♦ భరతమాత. 61

సీ. పుడమినుచితౌషధాలయం ♦ బులను బెట్టి
ధర్మ సత్రంబులనుగట్టి ♦ దయయు, మంచి
శీలమును గల్గి కవిత నా ♦ దరించి, హర్ష
వర్ధనుం డిలనేలెనో ♦ భరతమాత. 62

సీ. అప్పటికి సర్వదేశంబు ♦ లందు నెందు
కన్బడఁగరానినాగరి ♦ కతయు వెలసి
యవని యాచార్యకస్థాన ♦ మై వెలింగె
భారతభూమి యెల్లరికిని ♦ భరతమాత. 63

శిల్పశాస్త్రము, చిత్రవిద్య.

సీ. శిల్పశాస్త్రంబును, మఱియు ♦ చిత్రవిద్య
యాంధ్రరాజుల కాలంబు ♦ నందు మిగుల
వాసికెక్కియుఁ జాలవై ♦ భవముఁ గాంచె
భవ్యమగు నెన్నివిధముల ♦ భరతమాత. 64

సీ. చైత్యముల, స్తూపములను, రా ♦ జభవనముల
నాలయంబుల, మఱియు వి ♦ హారములును
చెలఁగి నిర్మాణమొనరింప ♦ శిల్పులకును
ప్రబలయుత్సాహమబ్బెనో ♦ భరతమాత. 65

గీ. చైత్యముల, కాన్హచైత్య ♦ మాశ్చర్యముగను
చిత్రితంబు; బయటఁ జూడఁ ♦ జెలువుఁ దప్పి
యున్న లోఁజూడ దేవేంద్రుఁ ♦ డున్నయట్టి
భవనమా యంచుఁ దోఁచును ♦ భరతమాత. 66

గీ. పునహా బొంబాయి పట్టణ ♦ ములకు మధ్య
కార్లె పర్వతమున, శిల్ప ♦ కారు లెలమి
బుద్ధిచాతుర్య హస్తనై ♦ పుణ్యములను
ధరణి దీని నిర్మించిరి ♦ భరతమాత. 67

గీ. ప్రబలమా యజంటా*విహా ♦ రంబుఁ జూడ
శిల్పకౌశల బుద్ధి వి ♦ శేషములను
హస్తవిన్యాసములను నె ♦ య్యమునఁ జూపు
పరమ శోభాయమానమై ♦ భరతమాత. 68

గీ. ఈయజంతా విహారపు ♦ సోయగములు
కన్నులున్నట్టివారలు ♦ గాంచఁగలరు;
కాంచి యానంద మొందంగ ♦ గలరుగాని
పలుకు లెఱుంగరు [illegible]వంత ♦ భరతమాత. 69

గీ. బుద్ధదేవుని జీవిత ♦ పుణ్యచర్య
లెలమిఁ దెల్పు ప్రదర్శన ♦ ములు విరివిగ
స్తంభముల, కుడ్యములను, చి ♦ త్రంబుగాను
కరము శోభిల్లుచుండును ♦ భరతమాత. 70

* అజంతా, అని మఱియొక పాఠము.

గీ. బౌద్ధభిక్షులకొఱకు, నీ ♦ పర్వతముల
సహజనిర్మాణశక్తి నీ ♦ చైత్యముల, వి
హారములను నిర్మించిరి ♦ యధికదీక్ష
ప్రబలగనుశిల్పకారులు ♦ భరతమాత. 71

గీ. స్తూపముల, యమరావతీ ♦ స్తూపమందు
చిత్రముగనలంకరణమై ♦ జవకళలు
నాట్యమాడులతావితా ♦ నములతోడ
వఱలుచుండుప్రాభవముగ ♦ భరతమాత. 72

గీ. జవకళలుట్టిపడునట్టి ♦ చిత్రములను
జంతువుల బొమ్మలును తగు ♦ సంచయంబు
రమ్యమౌపాలరాళ్ళపై ♦ ప్రాభవముగ
వఱలునాస్తూపమందున ♦ భరతమాత. 73

టాజ్ మహల్

గీ. ఆత్మధర్మపత్ని ♦ యభిమతంబునుదీర్పఁ
నామె పేరు శాశ్వ ♦ తంబుగాఁగ
నిలుచునటు సమాధి ♦ నిర్మించె 'టాజ్ మహల్'
వసుధషాజిహాను ♦ భరతమాత. 74

గీ. దివ్యభవనంబులెన్నియో ♦ నవ్యమైన
సొబగులను వెల్లివిరియఁనీ ♦ క్షోణియందు;

నట్టిమందిరములకెల్ల ♦ నగ్రగణ్య
మరయ! టాజ్ మహల్ గాదొకో ♦ భరతమాత. 75

గీ. షాజహాన్ చక్రవర్తిరా ♦ జ్యంబుచేయు
కాలమందున మనశిల్ప ♦ కళలు, నూత్న
వైభవోన్నతిఁ గాంచియు ♦ వాసికెక్కెఁ;
బ్రబలకీర్తిని గడియించె ♦ భరతమాత. 76

గీ. భరతఖండంబులోఁ గల ♦ భవ్యమైన
సుందరపుమందిరంబుల ♦ సొబగుకన్న
సుందరతమంబు యీదివ్య ♦ మందిరంబు?
పాలరాళ్ళ చిత్రితమది ♦ భరతమాత. 77

గీ. రత్నఖచితంబులైనవి ♦ నూత్నరమ్య
కుడ్యజాలంబులతోనది ♦ కూడియుండు
నిన్నుఁ గట్టిన యట్టుండు ♦ నేడుఁజూడఁ
గరముశోభిల్లుచుండునో ♦ భరతమాత. 78

గీ. పాలరాళ్ళతోఁ గట్టంగ ♦ బడినయట్టి
రమ్యమగు, కొలఁకులందునా ♦ రామమధ్య
మునను వెలయుచు నుండును ♦ మూడుకోట్ల
వ్యయము దీనినిఁగట్టంగ ♦ భరతమాత. 79

గీ. హిందుదేశంబు నందెన్నొ ♦ సుందరంబు
లైన మందిరములుయుండు ♦ నంతెకాని

సర్వసుందరమైనది ♦ షాజిహాను
భవ్యమైనట్టి 'తాజ్ మహల్' ♦ భరతమాత. 80

గీ. మూడువందల వత్సర ♦ ములకుమున్నె
ఎట్టిహస్తనైపుణ్యంబు ♦ నిలను గల్గి
నట్టిశిల్పులు మనదేశ ♦ మందునుండి
రగయదీనినిఁ గనుముయో ♦ భరతమాత. 81

గీ. దినమునిరువది వేలకు ♦ జనములుండి
ప్రబల యుత్సాహగరిమను ♦ పాటుపడుచు
పదియునేడేండ్లలోపల ♦ భవ్యముగను
ప్రజలు వినుతింపఁగట్టిరి ♦ భరతమాత. 82

గీ. అవని 'శిరోపలస్వప్న' ♦ మనుచుదాని
భవ్యమై భవనూత్న సౌ ♦ భాగ్యగరిమఁ
గాంచిపిలుతురు; నదియు నా ♦ గ్రాపురాన
కరము శోభిల్లుచుండును ♦ భరతమాత. 83

గీ. మఱియు నెన్నొ బౌద్ధుల శిల్ప ♦ మహిమజాటు
చూలయంబులు ప్రాకార ♦ జాలములును
విగ్రహంబులు తోరణాల్ ♦ వేనవేలు
భరతఖండంబు నందుండు ♦ భరతమాత 84

గీ. ఉదయగిరి కడ్వహాయును ♦ సర్వసోమ
ధ నాథపురము; శ్రీశైలంబు ♦ నాగమఱియు

కాంచిపురమును కురువట్టి ♦ గ్రామమున్న
ప్రబలగుడులకు ఖ్యాతియో ♦ భరతమాత. 85

గీ. అమ్మహాబలిపురమున ♦ నతులవైభ
వంబుగా యొంటిరాతి ♦ రథంబులైదు
యంగమంగును సౌందర్య ♦ మందుహస్త
వైభవమునందు వెలయును ♦ భరతమాత. 86

గీ. ధర్మరాజ, భీమార్జున, ద్రౌపదీ, ర
థములు-సహదేవనకుల సో ♦ దరుల రథము
కూడి యైదురథంబులు ♦ కోమగు మిగులు
భవ్యశిల్పవైభవముల ♦ భరతమాత. 87

గీ. ఢిల్లిపురినేడు గట్టిన ♦ శివిదోప
నింగిఁ దాకుచు తళతళ ♦ నెగడుచున్న
మాయయ స్తంభమార్య ♦ విద్యాతెలంగు
పరిబలముగ జాటుగాదెకో ♦ భరతమాత. 88

గీ. ఇట్టివెన్నియొ తనరారు ♦ హిందుదేశ
మందు : నాంధ్రులశిల్పవి ♦ ద్యామహిమల
కార్మిక ప్రౌఢి, సత్కళా ♦ కర్మజాటు
భవ్యసౌభాగ్య సంపత్తి ♦ భరతమాత. 89

దేశభక్తులు.

గీ. గర్భవారాసిఁబుట్టిగో ♦ ఖలుఁడు, లోక
మాన్యుఁడు, మహాత్ముయును పితా ♦ మహుఁడు, వీర

లాదినెందరొ దేశభ ♦ క్తాగ్రగణ్యు
లరసినీసేవసల్పిరి ♦ భరతమాత. 90

గీ. వీరుఁడుగయుంచెఁ బ్రహ్లాదు ♦ విభువధార్యు
నెంతయుననుకరించెసి ♦ శాంతశీలు
డతులగుణశాలిశాంతవ ♦ హితుఁడుబుధుఁడు
పసులకుపకారిశ్రీగాంధి ♦ భరతమాత. 91

గీ. తన్నుశాత్రవులెంతబా ♦ ధలనుముంప
నించుకేనియుమదినిచ ♦ లించకుండు
పరుషవాక్యంబుమాటాడ ♦ కరసిధరణి
వారివినుతించుచుండును ♦ భరతమాత. 92

గీ. సర్వసోదరభావంబు ♦ జగతిఁగప్పి
ఈశ్వరసృష్టిజెరలాడు ♦ నించుకంత
పాపినైననుకూర్మిరస్వ ♦ భావసృష్టి
నరయకనుబోధించుచుండును ♦ భరతమాత. 93

గీ. ఇతఁడుయాంగ్లేయుఁ,డితఁడుక్రి ♦ స్టియనునితఁడు
హైందవు, డితండుతురక, బ్రాహ్మణుడితండు
పంచముడితండుయంచుభా ♦ వించకుండు
భావవీధిమహాత్ముండు ♦ భరతమాత. 94

గీ. శాత్రవులుతనుకలుగాఁగ ♦ గాత్రమస్పై
నగుకుచున్ననుసైరింప ♦ న్యాయమంచు

యతుఁడు హితబోధఁగావించు ♦ నంచఋషులు
స్థిరమనంబున సతతంబు ♦ భరతమాత. 95

అహింసాతత్వము.

సీ. అఖిలదేశముల్ దౌర్జన్య ♦ మనుకరించి
యొకరి నొకరు హింసించి ♦ యోర్పులేక
కొట్టుకొని చచ్చుచుండంగ ♦ కూర్మితోడ
ప్రజలకు "అహింస" బోధించు భరతమాత. 96

సీ. మున్ను ప్రహ్లాదభక్తుండు ♦ తన్నుఁదండ్రి
కష్టపెట్టియు సహియింపఁ ♦ గడిగినట్లు
నేడు మా యక్కచెల్లెల్లు ♦ వేడుకగను
ప్రబల హింససహించిరి ♦ భరతమాత. 97

సీ. కొట్టిపడద్రోసి పొడిచినఁ ♦ గోపమునను
లాటికఱ్ఱలతో తల ♦ వ్రక్కలుగను
పగులఁ గొట్టినఁ జంపిన ♦ పంజబీలు
భావ్యముగ సహించిరిగాదె ♦ భరతమాత. 98

సీ. ఖండఖండాంతరస్థులుఁ ♦ నిండుమదిని
మాయకాలీల ధైర్య సా ♦ హసములెల్లఁ
జూచి విస్మయమొందుచు ♦ స్తోత్రాళి
కరయుఁ జేయుదురావింత ♦ భరతమాత. 99

గీ. ఇట్టిశాంతమిట్టి సహన ♦ మిట్టిశూర
మిట్టిధీర మిట్టియహింస ♦ యిట్టికరుణ
యిట్టి ధర్మంబు ధాత్రి యె ♦ ప్పట్టునైన
బరగుచున్నదె నిఁకవీడి ♦ భరతమాత. 100

గీ. కన్నబిడ్డలకైన ని ♦ క్కంబుగాను
లోపమొనరించి పెరవారి ♦ బాపమనుచు
బోషనను జేయునే ప్రేమ ♦ బొగడనేర
పరమ సహనంబునీకుయో ♦ భరతమాత. 101

గీ. అంతెకాకుండ పరదేశ ♦ సంతులెన్నొ
వేన వేలకునాశ్రయించి ♦ వేడ్కతోడ
నీయపార మాదరణ సా ♦ న్నిధ్యముగను
బడయుచున్నవి గనవేమె ♦ భరతమాత. తే 102

గీ. చంపఁగనయట్టి ♦ శాత్రవున్నైనను
ప్రేమచేరఁదీసి ♦ ప్రియము పలుక
ధర్మగుణముబోధ ♦ దయనొనరించెదు
వశమెనిన్నుఁ బొగడ ♦ భరతమాత. 103

గీ. ధార్మికునకుగాని ♦ దాతృత్వ సంపద
కనగరాదు భూమి ♦ గానయొసగులు
నీదుధర్మగుణము ♦ నిజముగాఁదెలియఁగ
వశమెబొగడనిన్ను ♦ భరతమాత. 104

గీ. ఎంతయోర్మియున్నదో ♦ యెవరి కెఱుక?
ఎంతసహనంబుయున్నదో ♦ యెవరి కెఱుక?
ఎంతశాంతత్వమున్నదో ♦ యెవరి కెఱుక?
నరయ నీయొక్క హృదయమాన ♦ భరతమాత. 105

గీ. ఏదియోగాయొక్క చందాన ♦ నింపుగులుకఁ
గన్నతల్లికి నీడయు ♦ గ్రాలునట్టి
జన్మభూమిని సేవింప ♦ జాలఁడేని
వానిజన్మంబు వ్యర్థగాదె ♦ భరతమాత. 106

గీ. మందబుద్ధినేమేమొయూ ♦ క్రందనంబు
నెఱపినాఁడ! తప్పన్నియు న్నించి, నీకృ
పాకటాక్షవీక్షణములు ♦ భవ్యముగను
ప్రసరఁ జేయుమునామీఁద ♦ భరతమాత. 107

గీ. జననిరో ! నీకిదేనను ♦ స్కారశతము !
తల్లిరో !! నీకునిదిగో జో ♦ తములశతము !
అమ్మరో !!! నీకునిదిగో జో ♦ హారుశతము!
వందన శతంబుమాతరో ♦ భరతమాత. 108

ఓం! శాంతి శ్శాంతిః.

సంపూర్ణము.

శ్రీ

శారదా గ్రంథమాల, కల్లూరు.

హిందూపురం, అనంతపురంజిల్లా.

భాషాభిమానులారా,

సీ. సినిమా, బయస్కోపు ♦ లను, నాటకంబులఁ
గాంచ వెచ్చింతురు గొ ♦ క్కంబు మిగుల
క్లబ్బుల దర్శింప ♦ కాఫి, టీ, కోకోల,
కై విత్తమెంతయో ♦ బోవుచుండు
కోటుసూటుల కెంతో ♦ హేటుబూటుల కెంతొ
తళుక్కు బెళుక్కుల కెంతో ♦ ధనముజాలు
నీటుపాటుల కెంతో ♦ యాటపాటల కెంతొ
సంగీత కచ్చేరి ♦ శాల కెంతొ
సిగరెట్ల కెంతో, యి ♦ స్పేటాకులకు నెంతొ
బీడిచుట్లల కెంతో ♦ వెడలు ధనము
ఇదియొక లెక్కయా ♦ యింకెన్ని జేతురో
భూరిగుణోన్నత ♦ పురుషులార!
వాటిలో నిదియొక్క ♦ భారంబనుచు మీరు
భాషనాదరణించి ♦ బరగుడయ్య
దినమొక్కదమ్మిడీ ♦ దీసిపెట్టినచాలు
"శ్రీశారద" నునాద ♦ రింప మీరు

గీ. ఇంతకార్యంబు జేసియు ♦ సంతసమునఁ
పోషణను జేయుఁడయ్య శ్రీప్ర ♦ పూర్ణమదిని
వేడుకొనుచున్నదయ్య స ♦ ద్వినయముగను
మహితయశులార! భాషాభి ♦ మానులార!

పుస్తకములు వలయువారు, చందాదారులు, కాగోరువారు, యీ క్రింది విలాసమునకు వ్రాసుకోవలెను.

కల్లూరు, హిందూపురం.
అనంతపురం జిల్లా.

కార్యదర్శి,
శారదా గ్రంథమాల.
15-12-23.

శ్రీ

శారదా గ్రంథమాలా నిబంధనలు.

1. ఈ గ్రంథమాలకు చేరు చందాదారులు ప్రవేశరుసుము చెల్లింపనక్కఱ లేదు.

2. వత్సరమునకు ౨ రూపాయలుమాత్రము చందా యేర్పడి యుండుటచే. పుస్తకము వి. పి. గాపంపిన యెడల 1-5-0 తగులును. అటుగాక చందా మొత్తమైన ౨ రూపాయలను మనియార్డరు ద్వారా పంపిన యెడల 3 అణాలు కూడి వచ్చును. గాన చందాదారులు కాగోరువారలెల్లరు మనియార్డరు ద్వారా తమ చందా మొత్తమును పంప ప్రార్థితులు.

3. విద్యార్థులకు, గ్రామజనులకు, స్త్రీలకు, చదువెఱిఁగిన మనుష్యులకు నుపయోగించునట్టి, శతకములు, స్తవ[illegible] నాటకములు, పురాణకథలు, ప్రహసనములు, విం[illegible] చిత్రములు, వినోదములు, కల్పనాకథలు మొదలు[illegible] పుస్తకములు, వత్సరమునకు ౬ ప్రచురింపబడి, చందా[illegible] పద్ధతిని విక్రయించబడును. ప్రతియొక పుస్తకమును [illegible]ములచే వ్రాయబడి ప్రకటింప బడుచుండును.

4. ప్రకృతము మా గ్రంథములు క్రౌను సైజులో గ్లేజు [illegible]న 30 పుటలకు మించియుండవు. చందాదారు [illegible]మైన కొలఁది మా పుస్తకములు కూడా పరిమాణము[illegible] ఆకృతి యందును వృద్ధి పొందుచుండును.

5. భాండాగారము నందుండు పుస్తకములు వీలైన [illegible] అందించుచుందుము.

ఇట్లు,

కార్యదర్శి.